రైతన్న గుండె చెరువు

- వర్షాలతో వరద నీరు దిగువకు లాగని వైనం
- చెరువులను తలపిస్తున్న వరి పొలాలు
- క్రాప్ హాలిడే దిశగా రైతులు

భీమవరం అర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలోనే అధిక వర్షాలు కురవడంతో వరి నారు మడులు, వరి నాట్లు నీటమునగడంతో రైతు గుండె చెరువయ్యింది. యనమదుర్రు డ్రెయిన్‌కు వరద పోటు ఎక్కువగా ఉండడంతో అన్నదాతకు ఆదిలోనే ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో వరి ఆయకట్టులోని పొలాల్లో రెండు, మూడు అడుగుల వరద నీరు నిలిచిపోవడంతో రైతులు సార్వాసాగు చేయాలా.. వద్దా అని అయోమయంలో పడ్డారు. భీమవరం మండలంలో గత దాళ్వా సాగు సుమారు 8 వేల 300 ఎకరాలలో చేశారు. ఖరీఫ్ సాగు సుమారు 6 వేల ఎకరాలలో శ్రీకారం చుట్టారు. తాడేరు, బేతపూడి, తుందుర్రు, అనాకోడేరు, కొమరాడ గ్రామాలు వరి ఆయకట్టు పల్లపు ప్రాంతాలు కావడంతో భారీ వర్షం కురిస్తే పంట పొలాల్లో వర్షపు నీరు దిగువకు లాగటం లేదు. దీంతో రైతులు సార్వా సాగును విరమించుకుంటున్నారు. ప్రతీ ఏడాది ఆగస్టు 15 లోపు వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జులై మొదటి వారం నుంచి అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది. వరి నారుమడులు, ముందుగా వేసిన వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. రైతులు ఆయిల్ ఇంజన్లు, కారేలతో వర్షపు నీటిని బయటకు తోడి వరిని కాపాడుకున్నారు. కొన్ని వరి నారుమడులు, నాట్లు దెబ్బతిన్నాయి. మరో పక్క యనమదుర్రు డ్రెయిన్‌కు వరదపోటు ఎక్కువగా ఉండటంతో దాని పరీవాహక డ్రెయిన్లలోకి వరదనీరు ఎగదన్నడంతో ఊడ్చిన వరినాట్లు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. ప్రతీ ఏటా ఖరీఫ్ సాగు కోత దశలో భారీ వర్షాలు, వరదలు వచ్చేవి. ఈ ఏడాది ఆదిలోనే వర్షాలు కురిసి సాగుకు ఆటంకం కలిగించడంతో రైతులు ఏమి చేయాలోనని తలలు పట్టుకుంటున్నారు.


డ్రెయిన్లలో పూడికను తొలగించాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు(ఫైల్)


ముంపునకు గురై చెరువు తలపిస్తున్న వరి చేలు


తాడేరులో కుళ్లిన వరి దుబ్బును చూపిస్తున్న రైతు తిరుమల సత్యనారాయణ

గుర్రపుడెక్క, సిల్టుతో పూడుకుపోయిన డ్రెయిన్లు

మండలంలో గునుపూడి సౌత్, కునాయికోడు, పల్లికోడు, ఎర్రకోడు, ఉప్పుకోడు డ్రెయిన్లు గుర్రపుడెక్క, సిల్టుతో పూడుకుపోయాయి. ఈ డ్రెయిన్లను ఆనుకుని వేలాది ఎకరాలలో వరి సాగవుతుండగా ఇటీవల కురిసిన అధిక వర్షాలకు వరద నీరు దిగువకు పారే మార్గం లేక పంట పొలాల్లో మూడు అడుగుల లోతు ఉండిపోయి చెరువులను తలపించాయి. వరి నాట్లు వేసే వీలు లేకపోవడంతో సుమారు 4 వేల ఎకరాల్లో రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారు.

క్రాప్ హాలిడే దిశగా రైతులు

మండలంలో డ్రెయిన్లు పూడికతో నిండిపోవడంతో వరద నీరు పంట పొలాల్లో మోకాళ్ల లోతు నిలిచిపోయింది. మరో పక్క దాళ్వాలో విక్రయించిన ధాన్యం సొమ్ములు చేతికి అందకపోవడం, ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించే అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 20 వేలు ఊసెత్తకపోవడంతో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు.

ముంపులోనే వరి పొలాలు



నేను 8 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. మొన్న వర్షాలకు చేలల్లో వర్షపు నీరు నిలిచిపోయి వరి నాట్లు కుళ్లిపోయాయి. మురుగు బోదెల ద్వారా నీరు వెళ్లపోవడంతో నాలుగడుగుల పైగా నీరు నిలిచిపోయింది. వరి నాట్లు వేసే వీలు లేకపోవడంతో సాగును విరమించుకుంటున్నాం.

కొప్పినీటి సతీష్, రైతు తాడేరు

రైతుల పట్ల చిన్నచూపు తగదు



రైతులను చిన్న చూపు చూడడం ప్రభుత్వానికి తగదు. మురుగు నీరు పారే డ్రెయిన్లు గుర్రపుడెక్క, సిల్టుతో పూడుకుపోయాయి. మొన్న వర్షాలు పడితే పంట పొలాలు చెరువులను తలపించాయి. మరో పక్క దాళ్వా ధాన్యం డబ్బులు చేతికందలేదు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందించే అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఊసే లేదు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయగలం.

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి, భీమవరం

క్లుప్తంగా

విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టిన లారీ


జాతీయ రహదారిపై విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టిన లారీ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం పరిధిలో 165వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి లారీ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలివి..భీమవరం నుంచి ఉండి వైపుగా వస్తున్న లారీ ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి హైటెన్షన్ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి క్రింద పడిపోవడంతో ఒక్కసారిగా వైర్ల నుంచి మంటలు రేగాయి. ఇది గమనించిన వాహనదారులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌ను నిలిపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

గరుడ ఏరోస్పేస్‌తో విష్ణు కళాశాల ఒప్పందం

భీమవరం: దేశంలో డ్రోన్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి భీమవరం విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గరుడ ఏరోస్పేస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సురక్షితమైన డ్రోన్ కార్యకలాపాలను ప్రారంభించి, భారతదేశంలో డ్రోన్ అధారిత అప్లికేషన్‌ల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఇప్పటికే తమ కళాశాలలో డ్రోన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డ్రోన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కో ఆర్డినేటర్ రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఉండి: ప్రజా ప్రతినిధులు మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మండలంలోని వివిధ గ్రామాలలో గల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కౌలు కార్డుల కోసం ఉప్పులూరు ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్ అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు గుత్తుల కనక మహాలక్ష్మి, దత్తాల సుజాతరాణి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి


నగర పంచాయతీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: నగర పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు నాన్ లేఅవుట్ ఫీజులను సక్రమంగా వసూలు చేయాలని ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు ఆదేశించారు. స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం బుధవారం కౌన్సిల్ హాలులో చైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో 60, 70 ఎకరాల్లో నాన్ లేఅవుట్ స్థలాలున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారి సమావేశం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆకివీడు, కాళ్ల మండలాల ప్రజలకు వెంకయ్య వయ్యేరు పంట కాలువలోని కలుషిత నీరు తాగడం వలన జబ్బులొస్తున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు రూ.30 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారన్నారు. దానిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకొని ట్రైల్‌రన్ వేస్తామన్నారు. అనంతరం వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు కట్టా రవి, గేదల అప్పారావు, నిమ్మల నాగు పలు సమస్యలపై మాట్లాడారు. చైర్‌పర్సన్ హైమావతి మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామన్నారు. శానిటరీ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని తెలిపారు. దోమల బెడదకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, కొత్త మిషన్ కొనుగోలుకు ప్రతిపాదనలు పంపామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

గొల్లలకోడేరులో సివిల్ రైట్స్ డే


గొల్లలకోడేరు లో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్న అధికారులు

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామ పంచాయతీ ఆవరణలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, వీఆర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, సమాచార లోపం కారణంగా కేవలం సచివాలయం, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారన్నారు. గ్రామాలలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, చట్టాలు, హక్కులు, దళితులకు వర్తించే రాయితీలు వంటి అంశాలపై చర్చించే అవకాశం లేకపోయిందని గ్రామానికి చెందిన దళితులు ఎవరూ సమావేశంలో పాల్గొనలేదని, సరైన సమాచారం ఇచ్చి ఉంటే దళితులు ఈ సమావేశానికి వచ్చి ఉండేవారన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల గురించి, దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షత, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలు, అత్యాచారాలు, మహిళల అక్రమ రవాణా, పోక్సో కేసులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, దళితుల శ్మశాన భూముల ఆక్రమణలు వంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ రైట్స్ డే నిర్వహించడంలో అలసత్వం వహించిన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ కుక్కల లక్ష్మి, ఆర్‌ఐ ముత్యాల నాగభూషణం, ఈవోపీఆర్డీ ఎం.రామాంజనేయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.రాము, ఎస్సై నాళం శ్రీనివాసరావు, , సచివాలయ కార్యదర్శి కె.శ్రీవిద్య, వీఆర్వో కె.ఇందిర, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగార్జున

కాళ్ల: మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దార్ నాగార్జున నియమితులయ్యారు. ఎన్నికల్లో భాగంగా బదిలీపై కాళ్ల మండలం వచ్చి తహసీల్దార్‌గా పని చేసిన శ్రీదేవి బదిలీపై కోనసీమ జిల్లాకు వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగార్జునను నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామ దేవతలైన శ్రీ పెద్దింట్లమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లకు బుధవారం ఆషాడ మాస సారె సమర్పించారు. సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

తాళ్లకోడును ఆకివీడులో విలీనం చేయాలి

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు కాలనీని ఆకివీడు నగర పంచాయతీలో విలీనం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. స్థానిక నగర పంచాయతీకి వచ్చిన ఆయనను బుధవారం కలిశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంకి అప్పారావు, తవిటి నాయుడు, వర్మ, రాంబాబు పాల్గొన్నారు.

చోరీ యత్నం

భీమవరం: ఒకటో పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంటి తాళాలను దొంగలు పగలగొట్టి దొంగతనానికి యత్నించిన సంఘటన ఇది. ఏఎస్సై దేవరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉంటున్న నాదు శేషగిరిరావు కుటుంబ సభ్యులు జూన్ 8న బెంగళూరు వెళ్లారు. తాళాలు వేసిన ఇంటి ఆవరణను పని మనిషి వెళ్లి శుభ్రం చేస్తుంటారు. బుధవారం ఉదయం వెళ్లేసరికి తాళాలు పగలగొట్టి వస్తువులు విసిరేసి ఉన్నాయి. శేషగిరిరావు బంధువు నల్లం లోకనాధరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ

భీమవరం: భారత క్రీడా రంగం వర్ధిల్లాలి.. జై భారత్ జై జై భారత్ అంటూ భీమవరం పట్టణంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులతో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభినందలు తెలుపుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన రెండో పట్టణ సీఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్‌లో మనుబాకర్ భారత్ తరఫున మొదటి బోణీ కొట్టడం గొప్ప విజయమని, భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూటన్, కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు. అనంతరం అభిరుచి నుంచి బొంబే స్వీట్స్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ సతీష్, ఏవో సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం


కోడుగుడ్డు నిమ్మరసం ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి రైతులకు కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోడిగుడ్డు నిమ్మరసం తయారు చేసే విధానాన్ని రైతులకు, ఎస్ ఎస్ జి మహిళలకు వివరించారు. ఒక ఎకరానికి నిమ్మరసం రెండు లీటర్లు, కోడి గుడ్లు 12 తీసుకోవాలన్నారు. ముందుగా గాజు సీసాలో నిమ్మరసం పోసి, కోడి గుడ్లు ఒకదాని మీద ఒకటి పెట్టి 12 రోజుల నుంచి 15 రోజులు ఉంచాలన్నారు. తర్వాత వడగట్టుకుని పావు కిలో బెల్లం కలిపినట్లయితే కోడిగుడ్డు నిమ్మరసం తయారవుతుందన్నారు. ఎకరానికి పావు లీటర్ కోడిగుడ్డు నిమ్మరసం 200 లీటర్ల నీటిలో కలుపుకొని వరి పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సీహెచ్ రవి కుమార్, ఎస్.దుర్గారావు, ఎం.అప్పారావు, వి.శ్రీకళ, ఎస్.కుమారి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పైపులైను విస్తరణ పనులు

కాళ్ల: మండలంలోని ఎస్సీ బోస్ కాలనీలో పైపులైన్ విస్తరణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామంలో శివారు ప్రాంతాలకు తాగునీరు అందటం లేదనే విషయాన్ని స్థానికులు సర్పంచ్ మంతెన శ్రీనివాసరాజు దృష్టికి తీసుకురావటంతో సమస్య పరిష్కరించే దిశగా విస్తరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంతెన శ్రీనివాసరాజు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం పైపులైన్ వేయటంతో శిథిలావస్థకు చేరి శివారు ప్రాంతాలకు తాగునీరు అందటం లేదని తెలిపారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంట్లో భాగంగా పంచాయతీ నిధులు రూ.2 లక్షల 75 వేలతో 400 మీటర్ల దూరం పైపులైన్ విస్తరణ పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సచివాలయ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి కీలకం

కాళ్ల: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అటువంటి వారిలో కనకరాజు ముందు ఉంటారని సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పి. శ్యాంసుందర్ అన్నారు. కాళ్లమండల విద్యాశాఖాధికారి-2గా పని చేస్తున్న గాదిరాజు కనకరాజు ఉద్యోగ విరమణ అభినందన సభ పెదఅమిరం నిర్మలా దేవి పంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని భీమవరం ఉప విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఎంవి.సత్యనారాయణ, దుర్గారావు, యూటీఎఫ్ నాయకుడు బి.రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎంఈవోలు సీతారామయ్య, పి.నాగరాజు, కె.నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి

ఉండి: క్రైస్తవుల అభ్యున్నతి కోసం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) పాటుపడుతుందని సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రత్నకుమార్, కార్యదర్శి జి.జార్జ్ బెన్‌హర్ అన్నారు. బుధవారం చెరుకువాడలో మండల నూతన అధ్యక్షుడు కె.శ్యామ్ అధ్యక్షతన ఏఐసీఎఫ్ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రైస్తవులపై ఎటువంటి దాడులు జరిగినా, ఇబ్బందికరమైన పరిణామాలు ఎదురైనా వాటిపై వెంటనే స్పందించమే కాకుండా తగు చర్యలకు పోరాటం చేస్తామన్నారు. నూతన ప్రభుత్వంలో క్రైస్తవులపై ఎటువంటి దాడులు జరగకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.చిరంజీవి జాకబ్‌రాజు, కన్వీనర్ పి.రాజు, ఎ.బిల్ మోరియా, ఎన్‌ఎస్‌కే కుమారి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తికి మిషన్ శక్తి అండ


మిషన్ శక్తిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ

ఆకివీడు: మహిళలకు అండగా అనేక చట్టాలున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆకివీడు అధికారిణి వి.వాణీవిజయరత్నం అన్నారు. మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం చెరుకుమిల్లి జెడ్పీ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలున్నాయన్నారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నకుమారి, దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

100 రోజుల అవగాహన కార్యక్రమం

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పీఎం మిషన్ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించామని సూపర్ వైజర్ వి.నిర్మల తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, ఏడు నెలల నుంచి ఐదేళ్ల పిల్లలకు మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వంద రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

భీమవరం అర్బన్: మహిళలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వారిపై దాడులు చేసినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి హెచ్చరించారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం మిషన్ శక్తి పథకంపై మహిళలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సుజాత రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారిపైన, సహకరించిన వారిపై కూడా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. మహిళల హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెం.181 అందుబాటులో ఉందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో కేటీవీ లక్ష్మీకాంతం, సూపర్ వైజర్ అనిల్ కుమారి, ఆశా వర్కర్లు, తల్లులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ చెన్నై**, ప్రిన్సిపల్ సెక్రటరీ అయిన **జాన్ దానియేల్ S/o.**జాషువా దానియేల్ చెన్నై వారి సంజాయిషీ పొంది, ఇందుమూలముగా జనయావన్మందికి తెలియజేయునది ఏమనగా!

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్థులను నాక్లయింట్,పశ్చిమగోదావరి జిల్లా, తాలూక, భీమవరం మున్సిపాలిటీ, బలుసుమూడి గ్రామము కాపురస్తులు శ్రీ పాకా (Late) నరసింహమూర్తి కుమారుడు 1) పాకా వెంకటసత్యనారాయణ, వయస్సు : 62సం॥గారిరీ సదరాస్తి, భీమవరం S.R.O లో రిజిష్టర్లు రాబడిన Reg. Document No.2311/1958 మరియు 2613/1958లో RS No.69లో య.4.07 సెం॥ప్రస్తుతము వారు విక్రయించగా మిగిలిన మొత్తములోయ.1.50 సెం॥ ను 7264.4 చ.అ.కలిగినటువంటిస్ధి విస్తీర్ణంగల స్థిరాస్తి హద్దులవివరములు :

తూర్పు	: సిమెంట్ రోడ్ అనుకుని ST Colony (286) చ.అ.
దక్షిణం	: 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ 228.6 చ.అ.
పశ్చిమం	: పాకా వెంకట సత్యనారాయణ గారి భూమి (286) చ.అ.
ఉత్తరం	: ఇతరుల భూమి 228.6 చ.అ.

ఈ షెడ్యూల్‌లో గల స్థిరాస్తిని నాక్లయింట్ క్రయం చేయుటకు అంగీకరించి, ఒప్పందంకుదుర్చుకొనియున్నారు.కావున ఈక్రయ విక్రయములను, ఏవరైన, ఏవిధమైన, న్యాయపరమైన అభ్యంతరములు గాని, బ్యాంక్ మరియు ఇతర ఋణములుగాని,కోర్టులో కేసులుగాని,మరియు చెల్లని క్లెయిము గాని ఉన్న యెడల ఈ ప్రకటన వేయబడిన తేదినుండి 7దినములలో నాకుగాని,నాక్లయింటుకు గాని, పూర్తి న్యాయపరమైన ఆధారములతో తెలియజేయగలరు. అటు లేని యెడల తదుపరి వచ్చు ఎటువంటి ఆక్షేపణ గాని, అభ్యంతరములు గాని నా క్లయింట్కు ఏవిధముగా భైండ్‌జేయజాలవు.

కె. రాజవర్ధనరావు అడ్వకేట్
విజయనగరం, సెల్:9440484286 ,9441070382



